నమస్తే తెలంగాణ

జోగులాంబ గద్వాల

వనపర్తి

5 | మహబూబ్‌నగర్, ఆదివారం 11 మే 2025 | JOGULAMBA GADWAL WANAPARTHY


# రైతన్న కన్నెర్ర

- తూకం వేసిన వడ్లను తరలించాలని ధర్నా
- కొనుగోలు నిర్లక్ష్యంపై ఫైర్
- శ్రీరంగాపురంలోని కొల్లాపూర్ వెళ్లే ప్రధాన రహదారిపై బైఠాయింపు

పెబ్బేరు, మే 10: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అధికారులు అడుగడుగునా రైతులను అరిగోసకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ కన్నెర్ర చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ శనివారం శ్రీరంగాపురం మండల రైతులు కొల్లాపూర్ ప్రధాన రహదారిపై బైఠాయించి ఆగ్రహం వ్యక్తం చేశారు. పెబ్బేరు మండలంలోని పలు గ్రామాల రైతులు కూడా వీరికి జత కలవడంతో పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని తూకం వేసి నాలుగైదు రోజులు గడుస్తున్నా.. లారీల్లేక మిల్లులకు తరలించడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని ఆరోపించారు. తూకం వేసిన వడ్లకు తరుగు పేరిట నాలుగైదు కిలోలు తగ్గిస్తున్నారని వాపోతున్నారు. ఈ సందర్భంగా శ్రీరంగాపురం సింగిల్ విండో అధ్యక్షుడు జగన్నాథంనాయుడు మాట్లాడుతూ.. రైతులపై ప్రభుత్వం మొండి వైఖరిని అవలంభిస్తున్నదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వరరెడ్డి, రాధాకృష్ణ, రమేశ్, పర్వతాలు, నగేశ్, వెంకటయ్య, శ్రీరాముడు తదితరులు పాల్గొన్నారు.


శ్రీరంగాపురంలో రోడ్డుపై బైఠాయించిన రైతులు



- ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ర్యాలీలు
- వార్‌లో భారత్ విజయం సాధించాలని ఆశీర్వాదం
- మిన్నంటిన జైహింద్ నినాదాలు
- ఆలయాల్లో పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు
- పాక్‌కు వ్యతిరేకంగా హోరెత్తిన నినాదాలు

# సైనికా విజయీభవ

ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ర్యాలీలు హోరెత్తాయి. మన జవాన్లు యుద్ధంలో విజయం సాధించాలని శనివారం ఉమ్మడి పాలమూరు జిల్లా వాసులు ఆకాంక్షించారు. వివిధ ఆలయాల్లో బీఆర్‌ఎస్, అర్చకులు, స్థానికుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు. బిజినేపల్లి మండలం మంగనూరు యువకులు పాక్‌కు వ్యతిరేకంగా నినాదించారు. టెర్రరిస్టులను పెంచి పోషిస్తున్న ఆ దేశానికి తగిన బుద్ధి చెప్పడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాల్పుల విరమణకు తూట్లు పొడిచిందని ఆగ్రహం చెందారు.

*– నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, మే 10*


బిజినేపల్లి మండలం మంగనూరులో ఉగ్రవాదుల చిత్రపటాలను తొక్కుతున్న యువకులు

## కోడేరు పీహెచ్‌సీపై రెడ్‌బ్యాండ్ ఏర్పాటు

కోడేరు, మే 10: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనంపై జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెడ్‌బ్యాండ్ ఏర్పాటు చేశారు. ప్రతి భవనంపై 12/12 అడుగుల వెడల్పుతో వైట్ ఫ్లోర్ మధ్యలో రెడ్‌క్రాస్ పెయింట్ వేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ దవాఖానలపై ఈ పెయింట్‌ను వేస్తున్న నేపథ్యంలో జిల్లా అధికారుల సూచన మేరకు ఏర్పాటు చేసినట్లు డాక్టర్ అని ల్‌కుమార్ శనివారం తెలిపారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో హెలికాప్టర్ విమానాల నుంచి క్షతగాత్రులను దవాఖానలకు తరలించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు రెడ్‌బ్యాండ్ ఉపయోగపడుతుందన్నారు.


కోడేరు దవాఖానపై వేసిన రెడ్‌బ్యాండ్


తిమ్మాజిపేటలో వీరమరణం పొందిన జవాన్ మురళికి కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

# అమరుడా జోహార్

- వీర జవాన్ మురళీ నాయక్‌కు నివాళి
- పలు చోట్ల కొవ్వొత్తులతో ప్రదర్శన
- కొత్తకోటలో 200 బైక్‌లతో ర్యాలీ

ఇండియా–పాక్ వార్‌లో ఎదురుకాల్పుల్లో వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్‌కు ఘన నివాళులర్పించారు. శనివారం ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో శాంతి ర్యాలీలు నిర్వహించారు. కొత్తకోటలో వాకర్ క్లబ్, లింగాల మండలం అంబట్‌పల్లి, నవాబ్‌పేట, ఊట్కూరు మండలం తిమ్మారెడ్డిపల్లి తండాతోపాటు పలు గ్రామాల్లో కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా బీఆర్‌ఎస్ నాయకులు నినాదాలు హోరెత్తించారు. భారత్ మాతాకీ జై, వందేమాతరం.. అంటూ నినాదించారు. వీర జవాన్ నాయక్‌కు జోహార్లు అర్పించారు. ప్రతి ప్రాణానికి పాక్ లెక్క చెప్పాల్సిందేనంటూ ఆగ్రహం చెందారు. బరితెగింపే భరతమాత బిడ్డల లక్షణమన్నారు.

# కల్లాల్లోనే ధాన్యం

# కళ్లల్లో దైన్యం

45 రోజులుగా ఎదురు చూపులు

- వరి కొనుగోలు చేయని పీఏసీసీఎస్ సిబ్బంది
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ముప్పిపల్లి అన్నదాతలు
- ప్రైవేట్ లారీలను తీసుకొచ్చి వడ్లను నింపిన గ్రామ రైతు
- పేరుకే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారంటూ ఆగ్రహం


ముప్పిపల్లిలో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో కల్లాలలోనే నిల్వ ఉన్న వడ్లు



### పడిగాపులతో విసుగుచెందా..

యాసంగిలో పండించిన వడ్లను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో అమ్ముకునేందుకు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. పంటకోసి 40రోజులవుతున్నా పీఏసీసీఎస్ అధికారులు ధాన్యాన్ని కొనుగోలు చేసి, తరలించకపోవడంతో వర్షానికి తడుస్తుందనే భయంతో గద్వాల నుంచి మూడు లారీలు అద్దెకు తీసుకొచ్చి అధికారుల సూచన మేరకు తరలించాం. గతంలో ఎన్నడూ ఈ విధంగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని అమ్మినప్పుడు ఇన్ని ఇబ్బందులు ఎదుర్కోలేదు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో పంట కోసినప్పటి నుంచి నేటి వరకు నానా యాతన పడ్డాం. సొంత ఖర్చులతో కొనుగోలు కేంద్రానికి ధాన్యం అప్పజెప్పి, దగ్గరుండి తరలించాల్సిన పరిస్థితి తలెత్తింది.

**– రాఘవేందర్ రెడ్డి, రైతు, ముప్పిపల్లి**


మక్తల్ మండలం ముప్పిపల్లిలో ప్రైవేట్ లారీలో ధాన్యాన్ని లోడ్ చేస్తున్న హమాలీలు

మక్తల్, మే 10: యాసంగి సీజన్‌లో రైతులు పండించిన చివరిగింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. పంటకోసి 45రోజులుగా వడ్ల రాశులు కల్లాల్లో మగ్గుతున్నా.. మక్తల్ మండలం ముప్పిపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సిబ్బంది ధాన్యం కొనుగోలు చేయక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొస్తే క్వింటాకు రూ.2,320తోపాటు రూ.500 బోనస్ ఇస్తుందని అధికారులు గొప్పలు చెప్పుకుంటున్నారు తప్పా.. సరైన సమయంలో వడ్లను కొనుగోలు చేసి రైతులకు ఇబ్బందుల్లేకుండా చేయడంలో పూర్తిగా విఫలమైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మక్తల్ మండలం ముప్పిపల్లిలో 15రోజుల కిందట మహిళా సమాఖ్య ద్వారా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించగా.. గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ పార్టీకి చెందిన వారిని కాకుండా బీఆర్‌ఎస్ నాయకులతో కొబ్బరికాయ ఏ విధంగా కొట్టిస్తారనే నేపంతో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి దృష్టికి తీసుకెళ్లి ముప్పిపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని మూసివేయించారు. అయితే ముప్పిపల్లిలో భారీగా యాసంగిలో ధాన్యం రావడంతో కొనుగోలు కేంద్రం ఎత్తివేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రైతుల విన్నపాలను విన్న కలెక్టర్ పీఏసీసీఎస్ ఆధ్వర్యంలో గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేయగా.. పీఏసీసీఎస్ అధికారులు ముప్పిపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కానీ నేటివరకు రైతుల నుంచి ఒకగింజ కూడా కొనుగోలు చేయలేదని రైతులు వాపోతున్నారు. పంట కోసి 45రోజులైనప్పటికీ కనీసం పీఏసీసీఎస్ అధికారులు రైతుల వరికల్లాలవైపు కన్నెత్తి చూడలేదంటే అతిశయోక్తి లేదు. వాతావరణంలో వచ్చే మార్పులతో వర్షానికి వడ్లు తడిసి ముద్దవుతాయని భయాందోళనకు గురికావాల్సిన పరిస్థితి తలెత్తిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు ఖాళీ సంచుల కోసం కార్యాలయం చుట్టూ తిరిగి విసిగి వేసారారు. ధాన్యాన్ని తరలించేందుకు గ్రామానికి లారీలు పంపించాలని రోజూ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితంలేకుండా పోయిందని తమ గోడును వెల్లబోస్తున్నారు. పీఏసీసీఎస్ అధికారుల నిర్లక్ష్య వైఖరితో రోజులు గడుస్తున్నాయి తప్పా.. కల్లాల్లో ధాన్యం తీసుకెళ్లేందుకు ఆలస్యం అవుతుందని గ్రహించి ముప్పిపల్లికి చెందిన రైతు రాఘవేందర్‌రెడ్డి పీఏసీసీఎస్ అధికారులకు సమాచారం ఇచ్చి జోగుళాంబ గద్వాల జిల్లా నుంచి సొంత ఖర్చుతో మూడు లారీలను తెప్పించి దాదాపు 1500 సంచుల వడ్లను శనివారం జోగుళాంబ గద్వాల జిల్లాలోని శివశక్తి ఇండస్ట్రీస్ రైస్‌మిల్లుకు తీసుకెళ్లారు. గ్రామంలో ఇంకా వేలకుపైగా సంచుల ధాన్యం కల్లాల్లో ఉన్నప్పటికీ కొనుగోలు చేసి తరలించడంలో అధికారులు పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం వహించడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయని రైతులు వాపోతున్నారు.


గోపాల్‌పేటలో రైతులతో కలిసి రోడ్డుపై ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

# మిల్లర్ల దోపిడీని అరికట్టాలి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి
- ఏఐకేఎస్ ఆధ్వర్యంలో రైతుల రాస్తారోకో

గోపాల్‌పేట, మే 10: రైస్ మిల్లర్లు జిల్లా వ్యాప్తంగా తరుగు, తాలు పేరుతో క్వింటాకు మూడు కిలోల పైన దోపిడీ చేయడాన్ని అధికారులు అరికట్టాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సింగిల్ విండో, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం తెలంగాణ రైతు సంఘం వనపర్తి జిల్లా కమిటీ పరిశీలించింది. ఈ సందర్భంగా పదిరోజులుగా లారీల కొరతతో ధాన్యం కొనుగోలు నిలిపి వేయడానికి నిరసనగా రైతులతో కలిసి బస్టాండ్ సమీపంలో ప్రధాన రహదారిపై రాస్తా రోకో చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పదిరోజుల నుంచి లారీల కొరతతో కొనుగోలు నిలిపివేయడం సరైన పద్ధతి కాదన్నారు. రోజుకు ప్రతి కొనుగోలు కేంద్రం నుంచి కనీసం 3 లారీల పైగా ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉందన్నారు. మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రోజురోజుకు 5 లారీల వరకు వచ్చేవిధంగా ప్రయత్నం చేయాలని డిమాండ్ చేశారు. రైతు పండించిన పంటను అమ్ముకునే దశలో కూడా ఇన్ని ఇబ్బందులకు గురవడం సరైన విధానం కాదని, కొనుగోలు కేంద్రాల్లో కూడా రైతులకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వమే ధాన్యాన్ని ఆరబెట్టడానికి కవర్ల పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు వచ్చేవరకు రాస్తారోకో విరమించేదిలేదని రోడ్డుపై భీష్మించుకు కూర్చున్నారు. దీంతో రాస్తారోకో వద్దకు జిల్లా సివిల్‌సప్లై అధికారి విశ్వనాథం వచ్చి రైతు సంఘం నాయకులతో మాట్లాడి రోజుకు 4లారీల నుంచి 5లారీల వరకు పంపిస్తామని, తరుగు, తాలు పేరుతో జరుగుతున్న దోపిడీని పరిశీలన చేసి రైతులకు న్యాయం చేసేవిధంగా ప్రయత్నిస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బాల్‌రాజు, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, మాజీ కోఆప్షన్ సభ్యుడు మతీన్, నాయకుడు కాశీనాథ్, రైతులు వెంకటయ్య, కృష్ణయ్య, బాల రాజు, కృష్ణమ్మ, లక్ష్మి, వెంకటలక్ష్మి, శాంతమ్మ, బాల స్వామి తదితరులు పాల్గొన్నారు.

# సొమ్మొకరిది.. సోకొకరిది

- కర్ణాటక వడ్లకు తెలంగాణ పాస్ బుక్కులు!
- కొనుగోలు సెంటర్ల వద్ద రాజకీయం
- ఐకేపీ కేంద్రం గదికి తాళం వేసి అన్నదాతల ఆగ్రహం

గద్వాల అర్బన్, మే 10: ప్రస్తుతం జిల్లాలోని సరిహద్దు ప్రాంతాల కొనుగోలు కేంద్రాలలో సొమ్ము ఒకరిది.. సోకు మరొకరిది అన్న వ్యవహారం సాగుతున్నది. కొనుగోలు కేంద్రం నిర్వాహకులు కర్ణాటక వడ్లకు ఇచ్చిన ప్రాధాన్యత తెలంగాణ వడ్లకు ఇవ్వడం లేదని పెద్దమొత్తంలో ఆరోపణలు వినిపిస్తున్నాయి. పౌరసరఫరాల శాఖ అధికారులు, దళారులు, ఐకేపీ సెంటర్ నిర్వాహకులు కుమ్మక్కై రాత్రి రాత్రికే కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చిన వడ్లను కొనుగోలు కేంద్రాలకు తరలించి కొనుగోలు చేస్తున్నారని శనివారం కేటీదొడ్డి మండలంలోని కొండాపురం రైతులు ఆరోపించారు. గ్రామంలో రాత్రికిరాత్రే వచ్చిన వడ్లకు టోకెన్ ఇస్తున్నారని.. మా వడ్లకు టోకెన్ ఇవ్వలేదని.. మా వడ్లకు గన్నీ బ్యాగులు లేవంటూ నిలిపివేస్తున్నారని ఆవేదనతో గ్రామంలోని కొనుగోలు కేంద్రం గదికి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. మండలంలో కొన్ని గ్రామాల్లో కర్ణాటక వడ్లు పెద్ద మొత్తంలో వచ్చినట్లు ఆరోపించారు. తమ వడ్లు కల్లాలకే పరిమితమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటక వడ్లు నేరుగా మిల్లులకే పంపుతున్నారని, వాటిని నేరుగా పంపడం ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద నిర్వాహకులు రాజకీయం చేస్తున్నారని, వారి పార్టీకి చెందిన వారికి ముందుగా వడ్లు నింపుతున్నారని, వేరే పార్టీకి చెందిన వారి వడ్లు నింపడంలో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. పెద్దగా పట్టించుకోవడం లేదని రైతులు వాపోయారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించాల్సిన అవసరం ఉందని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### ఈ వ్యవహారంపై తనిఖీ చేస్తున్నాం

రైతుల ఫిర్యాదు మేరకు కొండాపురం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించాం. ఎక్కడా ఇతర ప్రాంతాలకు చెందిన వడ్లు రాలేదు. గన్నీ బ్యాగులు ఇవ్వడంలో కొంత మేర ఆలస్యమైంది. ఆ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని వడ్లు తరలించడంలో కొంతమేర ఆలస్యమవుతున్నది. సమస్యను పరిష్కరించాం. అన్ని వడ్లు వీలైనంత త్వరగా తరలిస్తాం. అలాగే ఎప్పటికప్పుడు కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేస్తున్నాం. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వడ్లను కొనుగోలు చేయం.

***– గోపాల్, ఐకేపీ కేంద్రాల నిర్వాహకుడు***



కొనుగోలు కేంద్రానికి తాళం వేస్తున్న రైతులు

# పచ్చని ఆలోచన.. ఎండకు రక్షణ


చెట్ల నీడన సేదతీరుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతిష్టాత్మకంగా హరితహారం చేపట్టి విరివిగా మొక్కలు నాటారు. నేడు అవి పెరిగి పెద్దవిగా మారి నీడతోపాటు స్థానికులకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందిస్తున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో శనివారం టీఎస్‌ఆర్‌జేసీ పరీక్ష కొనసాగగా.. రాసేందుకు వచ్చిన విద్యార్థులు కేంద్రాల్లోకి వెళ్లిపోగా.. వారి వెంట వచ్చిన తల్లిదండ్రులు, బంధువులు మాత్రం ఎండ వేడిమి తట్టుకోలేక హైవేపై డివైడర్ మధ్యలో ఉన్న చెట్లకింద ఎండకు రక్షణగా పలువురు సేదతీరారు.

– బందిగె గోపి, ఫొటోగ్రాఫర్ మహబూబ్‌నగర్

## క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తా

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నిరంజన్‌రెడ్డి

పెబ్బేరు, మే 10: క్రీడాకారులకు ఎల్లవేళలా తన వంతుగా ప్రోత్సాహం అందిస్తానని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. పెబ్బేరు మండలం కంచిరావుపల్లిలో చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి ఓపెన్ టు ఆల్ కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తాను గతంలో ఇదే గ్రామానికి రూ.4లక్షలు వెచ్చించి కబడ్డీ మ్యాట్‌ను, బారికేడ్లను ఇప్పించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రాములు, జగన్నాథం, రమేశ్, గిరి, ఎల్లారెడ్డి, వెంకటేశ్, మధు పాల్గొన్నారు.

## కొనుగోలు వేగవంతం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

పాన్‌గల్, మే10: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కొల్లాపుర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కావని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ నాయక్, రైతు బంధు మండల మాజీ కోఆర్డినేటర్ వెంకటయ్య నాయుడు, నాయకులు జ్యోతినందన్‌రెడ్డి, వీర సాగర్, నర్సింహ, సరోజమ్మ, ప్రవీణ్‌రెడ్డి, రాంబాబునాయక్, ఆదిహన్మంతు, నవీన్‌రెడ్డి, సాయిలు, కొండల్, యాదగిరి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీరం